
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 3 జూలై 2025





గురజాల: మాడుగుల ఎస్సీ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ఉత్సాహంగా.. తొలి అడుగు



శావల్యాపురం : కనమర్లపూడిలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని పరామర్శిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



సత్తెనపల్లి 11 వార్డులో తొలి అడుగులో కన్నా లక్ష్మీనారాయణ



వెల్దుర్తి : శిరిగిరిపాడులో మహిళలతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

- జిల్లా అంతటా ఇంటింటికీ టీడీపీ ఆరంభం
- చేసిన పనులు వివరిస్తూ ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు
- నాలుగేళ్లలో చేసే పనులు చెప్తూ.. సమస్యలు తెలుసుకున్న నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇది మంచి ప్రభుత్వం.. సుపరిపాలనకు.. తొలిఅడుగు.. అంటూ బుధవారం టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లారు. చేసిన పనులు చెప్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేపట్టే పనులు వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ నేతలు ప్రజలతో మమేకమయ్యారు. నేరుగా తమ గడప వద్దకు వస్తున్న ప్రజాప్రతినిధులకు ఎక్కడికక్కడ ప్రజలు స్వాగతం పలికి, వారిని సత్కరించేందుకు ఉత్సాహం చూపారు. ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జిల్లా అంతటా కోలాహలంగా ప్రారంభమైంది. బూత్ స్థాయి నుంచి నియోజవర్గ స్థాయి వరకు నేతలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఇంటింటికి వెళ్లిన నేతలు వారితో ఫొటోలు తీసుకుని ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలతో పాటు వారి అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. కూటమి పాలనకు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమం.. అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను చెబుతూ సుపరిపాలనతో ప్రజలకు స్వేచ్ఛ లభించిందని వివరించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఇప్పటికే పింఛన్ పెంపుదల, ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికివందనం అమలు చేశామని చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాల అమలు చేస్తామని ప్రకటించగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన వెంటనే ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు పేదల కడుపు నింపుతున్నాయన్నారు.

తొలి అడుగులో ఎమ్మెల్యేలు..

తొలిరోజు తొలిఅడుగు కార్యక్రమంలో బుధవారం పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధిని వివరించి కరపత్రాలను ప్రజలకు అంద జేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురజాల మండలం మాడుగులలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటలోని 13, 14, 17 వార్డుల ప్రజలతో మమేకమయ్యారు. కూటమి పాలన అందరికీ స్వేచ్ఛ అందించిందని చెప్పారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లిలోని 11వ వార్డులో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. సుపరిపాలన ద్వారా ఇంటింటికి రెట్టింపు సంక్షేమం కూటమి ప్రభుత్వం అందిస్తోందని కన్నా తెలిపారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి సుపరిపాలన ప్రజలకు శ్రీరామ రక్ష అని ప్రజలకు చెప్పారు. పెదకూరపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తొలి అడుగు చేపట్టారు. రానున్న నాలుగేళ్లలో మరింతగా నిధులు రాబట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలపడమే తన లక్ష్యమని ప్రవీణ్ తెలిపారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అమెరికా పర్యటనలో ఉండగా తొలిఅడుగు కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నేతలు నిర్వహించారు.



చిలకలూరిపేట : తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పెదకూరపాడులో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

వెల్దుర్తిలో.. వైసీపీ ఖాళీ

- టీడీపీలోకి ఎంపీపీ సంజీవరెడ్డి
- అదే బాటలో ముగ్గురు ఎంపీటీసీలు, మాజీలు
- గంపగుత్తగా పసుపుకండువా కప్పుకున్న 100 కుటుంబాలు

మాచర్లటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రభుత్వం అంటూ ప్రజలకు ఏడాదిలో అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించేందుకు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం చేపట్టగా ప్రజలతో పాటు వైసీపీ నేతలు ఆకర్షితులవుతున్నారు. ఈ క్రమంలో వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో వైసీపీ నేతలు పెద్దఎత్తున టీడీపీలోకి క్యూ కట్టారు. వెల్దుర్తి మండల వైసీపీ సీనియర్ నేత, ప్రస్తుత మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి,



టీడీపీ కండువా కప్పి వైసీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

గంగలకుంట ఎంపీటీసీ దాసరి చినశ్రీనివాసరావు, వెల్దుర్తి ఎంపీటీసీ రాయనూతల లక్ష్మి, శిరిగిరిపాడు - 2 ఎంపీటీసీ రమావత్ బోడిబాయి, శిరిగిరిపాడు హాస్పిటల్ చైర్మన్ దిర్శినాల హనిమిరెడ్డి, గంగలకుంట మాజీ సర్పంచ్ వెంకట్రామయ్య, మాజీ ఎంపీటీసీ గందూరి వెంకటమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు దాదాపు 100 కుటుంబాలకు పైగా టీడీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలోకి వస్తున్న వారికి ఎమ్మెల్యే జూలకంటి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ వీడుతున్న నాయకులను ఎటువంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేయలేదని, ఉత్సాహభరిత వాతావరణంలో టీడీపీలోకి వస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా చంద్రబాబు పాలనా విధానాలకు మెచ్చి వైసీపీ నేతలు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో పిన్నెల్లి సోదరులు టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించి మరీ కండువా మార్పిడి రాజకీయాలకు తెర తీశారని గుర్తు చేశారు. సీఎం దార్శనికతతో ప్రశాంత వాతావరణంలో పాలన, రాజకీయాలు నడుస్తుంటే పచ్చని పల్లెల్లో చిచ్చు రాజేయ్యాలని మాజీ ఎమ్మెల్యే ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, అంజయ్య, కళ్లం రామాంజిరెడ్డి, కుర్రి శివారెడ్డి, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మయం





అమలు కాని నిషేధం

- మహమ్మారిలా మారిన ప్లాస్టిక్
- యథేచ్ఛగా వినియోగం.. విక్రయం
- తనిఖీలు మరిచిన మున్సిపల్ అధికారులు
- కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న కవర్లు

నరసరావుపేటలో వరద నీటి కాలువ నిండా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

ప్లాస్టిక్.. ప్లాస్టిక్.. ఎక్కడ చూసినా.. ఎవరి చేతిలో చూసినా.. ప్లాస్టిక్ కవర్లే. కర్రీ పాయింట్ల నుంచి టిఫిన్ బళ్లు సహా పెద్దపెద్ద హోటళ్లలో వేడివేడి ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. ప్రాణాలు తీయడమే కాదు.. పర్యావరణానికి ముప్పు అంటున్నా విక్రయాలు.. వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా 2018 అక్టోబరు 2 నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించింది. అపట్లో దాడులు.. కేసులు.. జరిమానాలతో కొంతవరకు ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయం కొంత అదుపులోకి వచ్చింది. అయితే 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని నీరుగార్చింది. దీంతో పట్టణాల్లో యథావిధిగా వినియోగం, విక్రయాలు సాగుతున్నాయి. డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూస్తే వాటి వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. తోపుడు బండ్ల వ్యాపారులు, చికెన్ సెంటర్లు, కూరగాయల వ్యాపారులు, ఆహార పదార్థాల విక్రయదారులు ఇలా అందరూ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు.

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

వేడివేడి ఆహార పదార్థాలు, కూరలు, కూల్‌గా ఉండే జ్యూస్‌లు, పండ్లు, ఇతర సామగ్రి ఏది తెచ్చుకోవాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. టిఫిన్ బళ్ల నుంచి కూరగాయల వ్యాపారుల వరకు కూడా ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. పర్యావరణానికి పెనుభూతంగా మారిని ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోకపోగా రోజు రోజుకు పెరుగుతుంది. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమల్లోకి తెచ్చినా గ్రామాలు సహా పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా అమలు కావడంలేదు. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను బహిరంగంగానే విక్రయిస్తున్నా.. ప్రజలు వినియోగిస్తున్నా పట్టించుకునే వారే లేరు. సామగ్రి ఏదైనా దుకాణాల్లో కొనుగోలు చేస్తే ప్లాస్టిక్ కవర్లపైనే ఆధారపడుతున్నాడు. దీనిని వ్యాపారులు ప్రోత్సహిస్తుండటంతో కవర్లను ఇష్టం వచ్చినట్లు వినియోగిస్తున్నారు. మున్సిపల్ పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్లపై కఠిన నిషేధం ఉన్నా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు పైపై దాడులతోనే సరిపెడుతున్నారు. కేసులు నమోదు కఠినంగా వ్యవహరించకపోవడంతో (మిగతా 8వ పేజీలో)



పంటల బీమా పథకాలపై పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- రైతులకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచన

నరసరావుపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమాలను రైతులు సద్వినియోగం చేసుకుని, ప్రయోజనం పొందాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయా పథకాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ ప్రసంగించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సహజ విపత్తుల కారణంగా రైతులకు కలిగే పంట నష్టాలపై ఆర్థిక రక్షణ కల్పించడమే ఆయా పథకాల ఉద్దేశమన్నారు. వాతావరణ ఆధారిత బీమా పత్తికి రూ.1,900, పీఎంఎఫ్‌బీవైలో ఎకరా వరికి రూ.80, మిరపకు రూ.360, కందికి రూ.40 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందాలన్నారు. ఈ పథకాలపై సందేహాలపై రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లో రైతులు సంప్రదించాలన్నారు. పంటల బీమా పథకాలపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు

- గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై రికార్డులు అందజేయండి
- ఇన్‌చార్జి వీసీని కోరిన విజిలెన్స్ అధికారులు

నేడు పడవ రేవులకు వేలం

పేకాట స్థావరంపై దాడి

- జూదరుల నుంచి రూ.10లక్షలు స్వాధీనం

6

హరితాంధ్ర లక్ష్యంగా.. నర్సరీలు

22 రకాల మొక్కలను పెంచుతోన్న అటవీశాఖ

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రాతో పాటు హరితాంధ్ర లక్ష్యంగా అటవీశాఖ ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేసింది. కర్లపూడి రిజర్వ్ ఫోరెస్టు పరిధిలోని 14వ మైలు సెంటర్‌లోని అటవీశాఖ నర్సరీలో 22 రకాలకు చెందిన 1,50,000 మొక్కలు సిద్ధమయ్యాయి. నర్సరీలో వేప, నేరేడు, చింత, దానిమ్మ, మారేడు, ఉసిరి, రావి, తెల్లమద్ది వంటి మొక్కలతో పాటు నీడను ఇచ్చే మొక్కలు కూడా పెంచారు. ఈ నర్సరీ నుంచి గడిచిన వనమహోత్సవానికి మండలానికి 800 మొక్కలు పంపిణీ చేసినట్లు అటవీశాఖ పర్యవేక్షణ అధికారి రామకృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1,50,000 మొక్కలలో లక్ష మొక్కలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో, 50 వేల మొక్కలు ఉపాధి హామీ పథకం ద్వారా పెంచుతున్నామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఉచితంగా, ప్రైవేటు వ్యక్తులకు కలెక్టర్ నిర్ణయించిన ధరకు విక్రయిస్తామన్నారు. అటవీశాఖ పరిధిలో ఉన్న 356 హెక్టార్ల కొండ ప్రాంతంలో వర్షాకాలం చివరిలో సీడ్ బాల్స్ చల్లి మొక్కలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించి వారు ఇళ్ల వద్ద మొక్కలు నాటితే పచ్చదనం పెరిగి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.




అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీ

బిరబిరా కృష్ణమ్మ

- సాగర్‌కు 25,789 క్యూసెక్కులు
- శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో కృష్ణమ్మ సాగరం దిశగా పరుగులు పెడుతూ వస్తోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి భారీగా నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. పది రోజుల నుంచి వరద నీరు శ్రీశైలానికి చేరుతోంది. దీంతో శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు బుధవారం 25,789 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 83,228 క్యూసెక్కులు రాగా రాత్రికి నీటి నిల్వ 164.20 టీఎంసీలకు చేరింది. శ్రీశైలానికి భారీగా వరద నీరు వస్తుండటంతో జలాశయం నిండు కుండను తలపిస్తోంది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 35,315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఇదేస్థాయిలో మరో వారం రోజులు వరద కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. సాగర్‌కు వరద నీరు వస్తుండటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం ఎప్పుడు నిండుతుంది.. సాగర్‌కు పంటల సాగు సరిపడా నీరు వస్తుందా అని నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు ఎప్పటికప్పుడు వరద నీటి ప్రవాహాన్ని అంతర్జాలం ద్వారా రైతులు గమనిస్తున్నారు. ఏ ఇద్దరు రైతులు కలసినా జలాశయాలకు వస్తున్న వరద నీటి లెక్కలు వేసుకుంటున్నారు.



శ్రీశైలం జలాశయంలో 164 టీఎంసీల నీటి మట్టం

నేడు పడవ రేవులకు వేలం

గుంటూరు సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పడవ రేవులకు గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ఉదయం టెండర్ ప్రక్రియ ప్రారంభించి, మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. అచ్చంపేట మండలంలోని గింజుపల్లి, చింతపల్లి పడవ రేవులతో పాటు మాదిపాడు బల్లకట్టుకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. మాచవరం మండలంలోని గోవిందాపురం బల్లకట్టుకు, అమరావతి మండలంలోని దిడుగు పడవ రేవుకు, కొల్లిపర మండలంలోని వల్లభాపురం పడవ రేవుకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలం లో పాల్గొనాలని డిప్యూటీ సీఈఓ కృష్ణ సూచించారు.

వర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు

● గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై రికార్డులు అందజేయండి

● ఇన్‌చార్జి వీసీని కోరిన విజిలెన్స్ అధికారులు

పెదకాకాని, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం విశ్వవిద్యాలయానికి చేరుకున్న విజిలెన్స్ అధికారులు వై శివన్నారాయణ, మరో అధికారి నేరుగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధర్ రావుతో భేటీ అయ్యారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై నివేదికలు కోరారు. అప్పటి వీసీ ఆచార్య రాజశేఖర్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు, వర్సిటీ ఇంజనీరింగ్ అధికారులు దోపిడీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నకిలీ ఉద్యోగుల నియామకాలు, ఒక ఇంజనీరింగ్ అధికారి తనకు ఇష్టం వచ్చినట్లుగా సిబ్బందిని నియమించుకున్నట్లు, కొంతమంది పేరుమీద అడ్డగోలుగా జీతాలు డ్రా చేసినట్లు ఫిర్యాదులు అందాయి. కొన్ని పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పాత బంగారం కొంటామని మోసం

● పెదకాకాని దర్గా వద్ద ఆశ్రయం పొందుతున్న నిందితులు

● ముఠాను అదుపులో తీసుకున్న శ్రీకాళహస్తి పోలీసులు

పెదకాకాని, జూలై 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతంలో మోసాలకు పాల్పడుతూ గుంటూరు జిల్లా పెదకాకాని బాజీ బాబా దర్గా వద్ద ఆశ్రయం ముఠాను బుధవారం శ్రీకాళహస్తి పోలీసులు అదుపులో తీసుకున్నారు. నార్త్ ఇండియాకి చెందిన ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు మొత్తం ఐదుగురు ఒక టీంగా ఏర్పడి శ్రీకాళహస్తి ప్రాంతంలో ప్రజలు మోసగిస్తున్నారు. పాత బంగారాన్ని కొంటామని చెప్పి, బంగారం తెచ్చిన తర్వాత నోట్ల కట్ల మధ్యలో తెల్ల కాగితాలు పెట్టి వారికి అప్పజెప్పి, అక్కడ నుంచి పారిపోతున్నారు. ఈ విధంగా పాత బంగారం ముసుగులో అనేక మందిని ఆ ప్రాంతంలో మోసం చేశారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శ్రీకాళహస్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడ మోసాలకు పాల్పడి పెదకాకాని బాజీ బాబా దర్గా వద్ద ఆశ్రయం పొందుతున్న ఈ దొంగల ముఠా గురించి సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గుర్తించారు. దీంతో పెదకాకాని పోలీసులను శ్రీకాళహస్తి పోలీసులు ఆశ్రయించారు. పెదకాకాని పోలీస్‌స్టేషన్ సిబ్బంది దర్గా వద్ద వీరు ఉంటున్న ప్రాంతాన్ని శ్రీకాళహస్తి పోలీసులకు చూపించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులో తీసుకొని శ్రీకాళహస్తి తరలించారు.

నెలవారీ మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు

● ఆర్‌టీవో రూ. 18 వేలు, పోలీసులు రూ. 3 వేలు ఇస్తేనే పంపిస్తున్నారు ● లేకుంటే భారీ పెనాల్టీలు విధించి కేసులు బనాయింపు ● ఇసుక లారీల యజమానులు, డ్రైవర్ల సమ్మె



అమరావతి రోడ్డులో సమ్మెకు దిగిన ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నెలవారీ మామూళ్ల కోసం రవాణ, పోలీసుశాఖ సిబ్బంది తమను పీడిస్తున్నారని ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు ఆరోపించారు. రవాణా శాఖ సిబ్బంది ఒక్కో లారీకి రూ. 18 వేలు, పోలీసులు రూ. 3 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇవ్వకపోతే కేసు నమోదు చేసి రూ. 50 వేల వరకు పెనాల్టీలు విధిస్తున్నారని చెప్పారు. ఈ వేధింపులను జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అడ్డుకోకపోతే తాము నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం అమరావతి రోడ్డులోని హోసన్నా మందిరం వద్ద ఇసుక లారీల యజమానులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం పేరుతో లోడింగ్ చేస్తున్న లారీలకు ఇష్టానుసారంగా జరిమానాలు విధిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలానే పీడించేవారని, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల పాటు ఏమి అనలేదని, ఇప్పుడు మళ్లీ మామూళ్ల డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. తద్వారా ప్రభుత్వానికి అధికారులు చెడ్డ పేరు తీసుకొస్తున్నారని తెలిపారు. తాము బిల్డర్లకి తక్కువ రేటుకి ఇసుక అందిస్తున్నామని, అయినప్పటికీ 3 నెలల నుంచి రవాణా శాఖ సిబ్బంది లారీ యాజమాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేసులు రాయకుండా ఉండాలి అంటే ముఖ్యమంత్రి దగ్గర నుంచి ప్రత్యేక జీవో తెచ్చుకోమని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద లోడింగ్ చేయడానికి ఎక్కువ రేటు తీసుకుంటున్నారని 20 టన్నులకు ఇవ్వాల్సిన బిల్లు 18 టన్నులకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో ఎక్కువ మోతాదులో ఇసుక తెస్తున్నారని రవాణా శాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. తాడికొండ, తుళ్లూరు పోలీసుస్టేషన్ల సిబ్బంది తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే గురువారం 100 లారీలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. హోసన్నా మందిరం నుంచి చిల్లీస్ వరకు లారీలతో ర్యాలీ చేపట్టి నాలుగు రోడ్ల కూడలిని దిగ్బంధిస్తామన్నారు. క్వారీల్లో లోడింగ్ విధానం ఒకేలా ఉండేలా చూడాలని కోరారు. కొన్ని లారీలకు ఓవర్ లోడింగ్‌కి అనుమతిస్తూ కొన్ని లారీలకు ఓవర్ లోడింగ్ ఇవ్వట్లేదన్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న లారీలకు ఆర్టీవో అధికారులు కేసులు పెట్టకుండా సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇసుక లారీల యజమానుల సంఘం నాయకులు డేగల ప్రదీప్, బోయపాటి తేజ, తన్నీరు శివ, తాడేపల్లి కోటేశ్వరరావు, వెనిగండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వీడనందుకు పెన్షన్ కట్ చేశారు..

● ఎమ్మెల్యే వేగేశన వద్ద ఆవేదన వెలిబుచ్చిన దివ్యాంగురాలు శివమ్మ ● త్వరలో పెన్షన్ ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ



దివ్యాంగురాలు బోయిన శివమ్మ చేయిపట్టుకుని నడిపిస్తూ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయనటానికి ఇదొక నిదర్శనం. పుట్టుకతోనే పోలియోబారిన పడి రెండుకాళ్ళు పనిచేయని పరిస్థితులో ఉన్న బోయిన శివమ్మకు ఎన్టీఆర్ పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టిన నాటి నుంచి 70 రూపాయల పెన్షన్ తీసుకుంటూ వచ్చింది. కేవలం తెలుగుదేశంపార్టీకి చెందిన వారని చెప్పి గత పాలకులు ఆమె పెన్షన్ నిలిపివేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే టీడీపీని వీడి వైసీపీలో చేరితే పెన్షన్ కొనసాగిస్తామని నీచరాజకీయాలు చేశారు. పెన్షన్ అయిన వదులుకుంటానుకాని పార్టీని మాత్రం వీడనని చెప్పిన దివ్యాంగురాలు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు తన ఆవేదన వెళ్ళబుచ్చింది. బాపట్ల పట్టణంలోని 9వ వార్డు చిల్లరగొల్లపాలెంకు చెందిన బోయిన శివమ్మకు పెన్షన్ పథకం ప్రారంభం నుంచే దివ్యాంగురాలు కావటంతో పెన్షన్ వచ్చేది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి ఆమె పెన్షన్ కట్ చేయించారు. కేవలం ఆమె కుటుంబం తెలుగుదేశంపార్టీ వారు కావటమే కారణం. పెన్షన్ నిలిపివేయటం గురించి కోన రఘుపతిని అడిగితే పార్టీ మారితే ఇస్తామని చెప్పటంతో ఆమె పెన్షన్ వదులుకుంది. పార్టీని వీడలేదు.వార్డుకొచ్చిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు జరిగినదంతా వివరించి మన ప్రభుత్వంలో తిరిగి నాకు పెన్షన్ ఇప్పించు అన్నా అని కోరింది. దీంతో తీవ్రంగా చలించిపోయిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆమె చేయి పట్టుకుని నడిపిస్తూ వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఇలాంటి వెదవపనులు కోన రఘుపతికే చెల్లుతాయని విమర్శించారు. త్వరలో పెన్షన్ ఇప్పిస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా చిల్లర గొల్లపాలెంలోని కుర్రా వీరయ్య, దొడ్డక వెంకటేశ్వరమ్మ పెన్షన్‌లు కూడా తీసేశారని ఎమ్మెల్యేకు వివరించారు. వైసీపీ అరాచకాలను వివరిస్తూ కూటమి ప్రభుత్వ సుపరిపాలన గురించి తెలియజేస్తూ పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు అందజేశారు.

ఉప్పరపాలెం మెటల్ క్వారీలలో అధికారుల తనిఖీలు



ఉప్పరపాలెం గ్రామ పరిధిలోని క్వారీలో జీఎన్ఎస్ఎస్ పరికరంతో కొలతలు వేస్తున్న మైనింగ్, సర్వే అధికారులు

యడ్లపాడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామ పరిధిలోని మెటల్ క్వారీలలో రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు బుధవారం ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఉప్పరపాలెం గ్రామానికి చెందిన కొందరు నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ చేస్తున్నారంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆర్డీవో మధులతను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించగా జూన్ 26న మైనింగ్, స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలసి ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉమ్మడి తనిఖీలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఉమ్మడి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 240/10లో గల కొండలో క్వారీయింగ్ నిర్వహించుకునేందుకు 23 మందికి లీజులు ఇవ్వడం జరిగిందన్నారు. వీటిలో 4 క్వారీల యజమానులు చైతన్య స్టోన్ క్రషర్‌కు 2, గాయత్రి స్టోన్ క్రషర్, ఆర్ సత్యన్నారాయణలకు చెందిన ఒక్కొక్క క్వారీకి పూర్తి అనుమతులు ఉన్నాయన్నారు. మరో 7 క్వారీలకు సంబంధించి దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయని, అన్ని అనుమతులు పూర్తయ్యాయని పొల్యూషన్ బోర్డు నుంచి సీఎఫ్‌వో మాత్రమే రావాల్సి ఉందన్నారు. మిగిలిన 12 క్వారీలకు అనుమతులు లేవని, వివిధ రకాల సమస్యల కారణంగా అనుమతులు రాలేదన్నారు. పూర్తి అనుమతులు ఉన్న నాలుగు క్వారీలకు సంబంధించి ఉమ్మడి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ సర్వేయర్లు అనుమతులు ఉన్న క్వారీలలో ఎంతమేర క్వారీయింగ్ జరిగిందన్న విషయంపై గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం(జీఎన్ఎస్ఎస్) ద్వారా కొలతలు సేకరిస్తారన్నారు. అయితే ఏ సర్వే నంబరులో ఎన్ని క్వారీలు ఉన్నాయి, లీజుదారులు ఎంతమంది, వారికి కేటాయించిన విస్తీర్ణం ఎంత, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు అనుమతులు ఉన్నాయి, అన్న విషయాలను మైనింగ్ అధికారులు తేల్చాల్సి ఉందన్నారు. అన్ని అంశాలను పరిశీలించి ఉమ్మడి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో మైనింగ్ టీపే కల్యాణి, సర్వేయర్ రవితేజ, మండల ఆర్ఐ సుబ్బారావు, మండల సర్వేయర్ సురేంద్ర, వీఆర్వో శివ కోటేశ్వరరావు, విలేజ్ సర్వేయర్లు శ్రీనివాసరావు, పవన్, ఏఎస్ఐ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహహింస బాధితులకు టోల్ ఫ్రీ నెంబర్ 15100

నరసరావుపేట లీగల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) గృహహింస బాధిత మహిళలకు జాతీయన్యాయ సేవాధికార సంస్థ పూర్తి అండగా నిలుస్తుందని సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేయవలసిందిగా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపుజిల్లా సెషన్స్ న్యాయాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత మహిళలకు చట్ట ప్రకారం ఆర్థిక,ఆరోగ్య, ఉచిత నివాస, చట్టపరమైన సహాయాలు లభిస్తాయన్నారు. బాధిత మహిళల తరపున పోలీసులకు సంబంధిత అధికారులు ఫిర్యాదు చేస్తారన్నారు. గృహహింస బాధిత మహిళలు తమ హక్కులను వినియోగించుకోవాలని. ఎవరూ అండగా లేరని తమలో తాము బాధపడాల్సిన అవసరం లేదన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

బాపట్లరూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్ గ్రామానికి చెందిన మల్లవరపు సాంబయ్య (65) అనే వ్యక్తి సైకిల్ మీద బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంటికెళుతుండగా బాపట్ల కమ్మకల్యాణ మండపం రహదారి మీద వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని కారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాంబయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ కారులో ఉన్న వ్యక్తులు బాపట్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు క్షతగాత్రుడిని తీసుకొచ్చారు. అయితే మార్గ మధ్యలోనే సాంబయ్య మృతి చెందటంతో కారులో ఉన్న ఇద్దరు మృతదేహాన్ని ప్రైవేట్ వైద్యశాలలో ఉంచి పారిపోయారు. ఈ మేరకు మృతుడి భార్య మల్లవరపు నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు పోలీసులు తరలించారు.

పౌర్ణమికి అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న పౌర్ణమికి అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్ళే భక్తుల కోసం గుంటూరు-2 డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సీహెచ్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షణ మహోత్సవాలకు డిపో నుంచి స్పెషల్ హైటెక్ (2+2)పుష్ బ్యాక్ బస్ ఏర్పాటు చేశామని, ఈ బస్ జూలై 8వ తేదీన రాత్రి 9, 15 గంటలకు గుంటూరులో బయలు దేరి, జూలై 9న శ్రీకాళహస్తి, కాణిపాకం,శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడ నుంచి బయలు దేరి పౌర్ణమిరోజు అనగా జూలై 10న ఉదయం అరుణాచలం చేరుకుంటుందని, అదే రోజు గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శించుకొని, జూలై 10 వ తారీకు సాయంత్రం అరుణాచలంలో బయలు దేరి జూలై 11వ తారీకు ఉదయం 6, 30 గంటలకు గుంటూరు చేరుతుందన్నారు. సర్వీస్ 96164 నెంబర్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఒక్కో టికెట్ ధర రూ 2420 మాత్రమేనని, అదనపు సమాచారం కోసం 7382897459, 7382894613 సంప్రదించాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి

● విద్యుత్ భద్రతా డైరక్టర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి, వేదికపై ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు సీపీడీసీఎల్ యంత్రాంగం మరింత పకడ్బందీగా నిబంధనలు పాటించాలని విద్యుత్‌శాఖ భద్రతా డైరక్టర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జీ విజయలక్ష్మి సూచించారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గుం టూరు నల్లచెరువులోని గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యాల యంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ శ్రీనివాసబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జూన్ 26వ తేదీ నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ పోల్స్‌ను, సపోర్టు తీగెలను తాకవద్దని, సేఫ్టీ పరికరాలతోనే పనిచేయాలన్నారు. మూడు పిన్‌ల సాకెట్‌లను, మూడు పిన్‌ల ప్లగ్‌లను మాత్రమే వాడాలన్నారు. విద్యుత్ సరఫరా నిలపకుండా పనిచేయరాదని, సరఫరా నిలిపివేసి నిర్ధారించుకున్నాక మరమ్మతులు చేయాలని సూచించారు. తడిచేత్తో విద్యుత్ పరికరాలు, స్విచ్‌లను వేయవద్దన్నారు. న్యూట్రల్ వైర్, ఎర్త్ వైర్‌లను ఒకదానికి ఒకటి కలపవద్దన్నారు. గృహాలలో వినియోగించే ఇన్వర్టర్‌లకు సరైన గాలి, వెలుతురు ప్రసరించే విధంగా ఉండా లన్నారు. ఎప్పుడూ మరమ్మతులు, తనిఖీ కోసం ధృవీక రించిన ఎలక్ట్రీషియన్‌ను మాత్రమే సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆపరేషన్ డిప్యూటీ ఈఈలు, ఏఈలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

● 11 వాహనాలు స్వాధీనం



అరెస్టయిన దొంగలు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

చిలకలూరిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న పట్టణానికి చెందిన ముగ్గురు యువకులను చిలకలూరిపేట అర్బన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పోలాసు ఉదయకిరణ్ (21), బాణావతు జశ్వంత్ నాయక్ (20), కొడావతు బాలస్వామి నాయక్ (26) ఉన్నారు. ఈ సందర్భంగా విలేకలరు సమావేశంలో అర్బన్ సీఐ పీ రమేష్ మాట్లాడుతూ మాల్స్, గృహాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాల్స్ వద్ద పార్కు చేసిన వాహనాలను వీరు దొంగిలిస్తున్నారని తెలిపారు. స్థానిక పోలిరెడ్డిపాలెం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో వీరు పోలీసుల కంటపడ్డరని.. విచారించగా చిలకలూరిపేటలో 9, పెదకాకాని, నందివెలుగులలో ఒక్కొక్కటి చొప్పున వాహనాలను దొంగిలించినట్టు గుర్తించారు. దొంగిలించిన వాహనాలను స్థానిక నరసరావుపేట రోడ్డులో ఒక గిడ్డంగి పక్కన ముళ్ళపొదలలో దాచి ఉంచగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్ఐలు చెన్నకేశవులు, రహంతుల్లా పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● జూదరుల నుంచి రూ.10లక్షలు స్వాధీనం



జూదరులను అదుపులోకి తీసుకున్న సీఐ అచ్చయ్య, ఎస్ఐలు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయం సమీపంలోని ఎస్ఆర్ఆర్ వసతి గృహంలో రూమ్ నెంబరు 206ను అద్దెకు తీసుకుని పేకాట ఆడుతున్న తరుణంలో అమరావతి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహిం చారు. ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ హనుమంతరావు ఆధ్వ ర్యంలో బుధవారం పోలీసులు నిర్వహించిన దాడిలో పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 లక్షల 38వేల నగదును, 11సెల్‌ఫోన్లు, రెండు కార్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. జూదరులను స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేశారు. వసతి గృహం యజమానిపై కేసు నమోదు చేశారు. వీరు సత్తెనపల్లి, క్రోసూరు, నరసరావుపేట నుంచి వచ్చి పేకాట ఆడుతున్నారు. దాడులు నిర్వహిం చిన వారిలో సీఐ అచ్చయ్య, ఎస్ఐలు రాజశేఖర్, అమీర్‌లతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు. అమరావతిలో పేరుకు భక్తులకు, పర్యాటకులకు వసతి గృహాలు నిర్వహి స్తూ పేకాట, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే జంటలకు ఆతిథ్యం ఇస్తున్నారు. వీటిపై పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైన వారం వారం వసతి గృహాలను తనిఖీ నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

లైసెన్స్‌డ్ దుకాణాల నుంచే మద్యం కొనుగోలు చేయాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి మణికంఠ

నరసరావుపేట లీగల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయవలసిందిగా పల్నాడు జిల్లా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ అధికారి మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యం తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పి కొందరు వ్యక్తులు మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసేది నకిలీ మద్యం కావచ్చన్నారు. ఆ మద్యం సేవించినట్లయితే ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగి.. కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారి తీయవచ్చునన్నారు. సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్14405 కు గాని, పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నెంబర్ 9440902480కు గాని తెలియజేయాలన్నారు.

పింఛన్ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ

యడ్లపాడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛను నిధులను వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యడ్లపాడు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేశాడు. స్వంతానికి వాడుకున్న రూ.9,50,500నగదు మొత్తాన్ని బుధవారం ప్రభుత్వ ఖాతాకు జమచేశాడు. యడ్లపాడు 1, 2 సచివాలయాల పరిధిలో పంపిణీ కాని పింఛను సొమ్మును ఏ నెలకు ఆ నెల తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ నాలుగు నెలలుగా స్వంత అవసరాలకు వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. డీఆర్డీఏ అధికారులు చేపట్టిన తనిఖీలలో ఈ విషయం వెలుగు చూడడంతో ఎంపీడీవో హేమలతకు సమాచారం అందించారు. దీనితో ఎంపీడీవో విచారించి 24గంటల వ్యవధిలోగా నగదు జమ చేయకపోతే కేసు నమోదు చేస్తామని మంగళవారం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ బుధవారం వాడుకున్న మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేశాడు. దీనితో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు ఉంటాయా అన్న ప్రశ్నకు అది తమ పరిధిలోకి రాదని సంబంధిత డీఆర్డీఏ శాఖాధికారుల నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుందని ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

45,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,390 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,119 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	10000	12500	నెంబరు. 5	10000	13300
341	10000	13400	341	10000	13200
సూపర్ 10	9700	12400	4884	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			సూపర్ 10	---	---
తేజ	10000	14000	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
షార్క్-1	---	---	తేజ	10000	13600
బ్యాడిగి 355	10000	12800	బ్యాడిగి	10000	12800
సింజెంటా బ్యాడిగి	---	---	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12600	తాలుకాయలు	4500	7000

నేడు టీడీపీ నేతల సమావేశం

మాచర్ల రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు టీడీపీ నేతల ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి, కో-యూనిట్ ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జి, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు అంచులవారిపాలెంలో సుపరిపాలన తొలిఅడుగు

రాజుపాలెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంచులవారిపాలెంలో నేడు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సంవత్సర కాలంలో చేసిన చేసిన పనులను చెప్పుకోవటానికి తలపెట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు వెల్దుర్తిలో..

మాచర్లటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్దుర్తిలో గురువారం జరగనున్న సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

అచ్చంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిండుజర్ల గ్రామంలో గోగుల మునియ్యకు చెందిన వ్యవసాయపు ఎద్దు బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. సమీపంలోనే ఉన్న ఎర్త్ వైర్‌కు కరెంటు రావటంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మంగళవారం కూడా పురిమి కాటం రాజుకు చెందిన పొట్టేల్ కూడా విద్యుత్‌షాక్‌తోనే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. నిండుజర్ల గ్రామం మండలకేంద్రానికి చివరిలో ఉండటం వల్ల గతంలో కూడా విద్యుత్ ప్రమాదాలు జరిగి పాడి గేదెలు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి.

4న ఆలయ భూముల వేలం

రెంటచింతల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, రెంటాలలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయానికి చెందిన భూములకు ఈ నెల 4న ఆయా గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు.పాటలో పాడుకునే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. మొత్తం 13 ఎకరాల 76 సెంట్లకు వేలం నిర్వహిస్తామన్నారు.

ఎయిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత

కారంపూడి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చాట్ల సులోచన అనారోగ్య కారణాలతో మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యశాలతో చికిత్స పొందుతోంది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి పుల్లయ్య ఆదేశాల మేరకు బుధవారం మహిళా పోలీసు కే షారోన్, టీడీపీ నేత కోట రాంబాబు ఎయిమ్స్‌కు వెళ్లి సులోచనకు పింఛన్ నగదు రూ.4 వేలు అందించారు. అలాగే రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

సుపరిపాలనకు ప్రతీకగా రహదారులు



ఎనికపాడుకు కోటి రూపాయలతో నిర్మించిన బీటీరోడ్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తిచేసుకుని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని పాలనచేస్తూ సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తుంది. సంవత్సర కాలంలో అమరావతి మండలపరిధిలో లింగాపురం, నెమలికల్లు, ఎనికపాడు, మునగోడు గ్రామాలకు రూ.6కోట్లతో బీటీ, సీసీ రహదారులను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించి ప్రజల మన్ననలను పొందింది. అమరావతి-గుంటూరు రోడ్డు నుంచి ఎనికపాడుకు కోటి రూపాయలతో బీటీ రహదారి, మునగోడు- అత్తలూరు రోడ్డుకు రెండు కోట్లు, నెమలికల్లు-మండెపూడి బీటీ రోడ్‌కు 2.3కోట్లు, లింగాపురంలో కోటి రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించారు. ఈ రహదారులు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంజూరు చేయించి త్వరితగతిన పూర్తిచేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం అభివృద్ధిపై వేసిన తొలిఅడుగుగా ఈ రహదారులు కనిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు : ఆర్టీవో శేషిరెడ్డి

దాచేపల్లి, రెంటచింతల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బస్సులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలని, విరుద్ధంగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మాచర్ల ఆర్టీవో శేషిరెడ్డి తెలిపారు. బుధవారం దాచేపల్లిలోని ప్రైవేట్ పాఠశాలల, రెంటచింతలలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో పాఠశాల బస్సులను ఆయన పర్యవేక్షించారు. వాటి ఫిట్‌నెస్, డ్రైవర్లకు ఉండాల్సిన అనుమతులు తనిఖీ చేశారు. ప్రతి బస్సుకు అటెండర్ ఉండాలని, చీటింగ్ పరిమితికి మించి పిల్లలను ఎక్కించరాదని వివరించారు. ప్రతి బస్సులో తప్పనిసరిగా ఫైరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఎగ్జిట్ డోర్ ఉండాలని వివరించారు. డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలని, బస్సు లోపల నోటీసు బోర్డు ఉండాలని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రవాణాశాఖ అధికారి కేవీఎల్ రావు తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాన్ని దోచేశారు

- అభివృద్ధి చేయకపోగా అరాచకం సృష్టించారు
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని



ర్యాలీలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో దత్తత గ్రామాన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తే 2019 - 2024 వైసీపీ హయాంలో గ్రామాన్ని దోచుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయకపోగా అరాచకం సృష్టించారంటూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని మాడుగులలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మొదటి రోజున నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన వీరికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పూల వర్షంతో స్వాగతం పలికారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షం పడుతున్నా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రామాలయం సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో మాడుగుల గ్రామం అస్తవ్యస్తంగా ఉండేది ని, వర్షం పడిందంటే గ్రామానికి రావాలంటే బురదమయంగా ఉండేదని అన్నారు. ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకొని కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు వేయించామన్నారు. తాను 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఈ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 2014- 2019 టీడీపీ హయాంలో గ్రామంలో తాగునీరు, విద్యుత్ సబ్‌స్టేషన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామన్నారు. వైసీపీ హయాంలో గ్రామాన్ని అభివృద్ధి చేయకపోగా అరాచకాలు సృష్టించి గ్రామంలోని మైనింగ్, రంగురాళ్ల దోపిడి ఇలా అనేక రకాలుగా గ్రామాన్ని దోచుకున్నారని ఆగ్రహించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యాన నియోజకవర్గానికి భారీ నిధులు వస్తున్నాయన్నారు. మాచర్ల, గురజాల నియోజకవర్గం తాగునీరు కింద రూ.1200 కోట్లు మంజూరయ్యాయన్నారు. అలాగే కొండమోడు - పేరేచర్ల రోడ్డు వెడల్పుకు సుమారు రూ.700 కోట్లు ఎంపీ మంజూరు చేశారన్నారు. మాడుగుల గ్రామం ముందు ఉన్న ఎద్దుల వాగుకు రూ.40 లక్షల నిధులుకు అనుమతులు వచ్చాయన్నారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని తన నియోజకవర్గాన్ని అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు ఎప్పుడు అండగా, తోడుగా ఉంటారని కొనియాడారు. అలాగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటి వరకు ఎన్ని పథకాలు అమలు చేశారు.. రానున్న రోజుల్లో ఏం అమలు చేయబోతున్నారనే వాటిని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అలాగే పార్లమెంట్, నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తీసుకువస్తున్నామన్నారు. గ్రామంలోని రామాలయం, సత్రం, వెంకటస్వామి సెంటర్ల వద్ద ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మాడుగుల సీనియర్ నాయకులు యాగంటి రామారావు, చావా రామారావు, భారీగా మహిళలు, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..

మాడుగుల గ్రామానికి వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు గ్రామం ముందు ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకులను సందర్శించారు. స్కూల్‌లోకి వెళ్లగానే స్కూల్లో చదువుకుంటున్న 420మంది విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ స్కూల్ ప్రిన్సిపాల్ స్కూల్‌లోని పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ నిచ్చారు.



● కార్యక్రమం అనంతరం గ్రామంలోని యాగంటి రామారావు గృహంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పల్లె నిద్ర చేశారు.

సుపరిపాలన ద్వారా ఇంటింటికి రెట్టింపు సంక్షేమం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన ద్వారా కూటమి ఇంటింటికి రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని 11వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా?, సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని కోరారు. సమస్యలను అడిగి తెలుసుకొని మై టీడీపీ యాప్‌లో ఆయన స్వయంగా నమోదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నేతలు తాతా జయప్రకాష్ నారాయణ, ఎలినేడి రామ స్వామి, నాగోతు శౌరయ్య, భీమినేని వందనాదేవి, మన్నవ శారదాదేవి, చుక్కపల్లి కొండలు, మస్తాన్‌వలి, నూర్‌బాషా జానీబాబు, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సంవత్సర కాలంలో టీడీపీ చేసిన అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.



11 వార్డులో జరిగిన సుపరిపాలన తొలి అడుగులో పాల్గొని కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

ఏడాదిగా సుపరిపాలన సాగుతోంది

సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో ఏడాదిగా సుపరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే కన్నా అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పినట్టుగా అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన డీఎస్సీనే తప్ప జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆరు సంవత్సరాల తరువాత చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ ద్వారా పేదలకు, కార్మికులకు మూడు పూట్ల ఆహారం అందుతుందన్నారు. సుపరిపాలన తొలిఅడుగు పేరిట నెల రోజుల పాటు తొలి ఏడాదిలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి వివరిస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు తాతా జయ ప్రకాష్ నారాయణ, ఎలినేడి రామస్వామి, భీమినేని వందనాదేవి తదితరులు ఉన్నారు.

ప్రజలకు చేరువగా సుపరిపాలనలో తొలిఅడుగు

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- పెదకూరపాడు, దిడుగు గ్రామాల్లో.. ఇంటింటికి వెళ్లి కరపత్రాల పంపిణీ

పెదకూరపాడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల మనస్సుకు చేరే పాలన సుపరిపాలనలో తొలి అడుగు మాత్రమేనని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో బుధవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు అందుతున్న పథకాలను ఇంటింటికి చేరేలా చేయటం ద్వారా ప్రజాపాలన ప్రజల వద్దకే అనే భావనకు అనుగుణంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. పేదరికానికి ముగింపు ఇచ్చేలా ధరలు, పంటల బీమా, పింఛన్‌లు, ఉచిత బోర్‌వెల్స్ ఆరోగ్యశ్రీ, మహిళా భద్రత, తాగునీటి పథకాలు ఇలా అనేక కార్యక్రమాలను రానున్న నాలుగు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి చేసేలా కూటమి కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఏడాది కాలంలో రూ.85 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేశామని, రానున్న నాలుగు సంవత్సరాల్లో భారీగా నిధులు తెచ్చి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామన్నారు. ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రతి ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు కుర్రా అప్పారావు, మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, మండల నేతలు అర్తిమళ్ళ రమేష్, భాష్యం ఆంజనేయులు, పరుచూరి పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీ పీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, వడ్లమూడి అప్పారావు, మండల శ్రేణులు ఏటుకూరి రత్నకుమార్, డాక్టర్ గుడిపూడి చిన రాజు, ఆంధ్ర ప్రసాదు, షేక్ ముంతాజ్, మాదినేని సుబ్బయ్య, షేక్ అజ్మల్లా, చెన్నుపాటి బుల్లిబాబు, షేక్ మస్తాన్ షరీఫ్, గల్లా శివ, అర్తిమళ్ళ కృష్ణ, గంగినేని లీలావతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కుర్రా అప్పారావు తదితరులు

రూ.40 లక్షలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

పెదకూరపాడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. పెదకూరపాడు నడిబొడ్డులో ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరటంతో గ్రామస్థులు ఈ విషయమై ఎమ్మెల్యేకు విన్నవించారు. డీఎంఎఫ్‌టీ నిధులను వంతెన నిర్మాణానికి మంజూరు చేయటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



ఎస్టీ కాలనీలో ఓకుటుంబానికి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

సంక్షేమ పాలన అందిస్తున్న కూటమి

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తూ పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలపరిధిలోని దిడుగు గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో బాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రచురించిన కరపత్రాన్ని అందజేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన చేస్తున్నారన్నారు. కూటమికి ప్రజల అండదండలు ఎల్లప్పుడూ ఉండాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబడిపూడిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

అచ్చంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మొదటి రోజు ప్రారంభించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంతో పాటు గ్రామ కమిటీ అధ్యక్షుడు పారుపల్లి స్వామి, కొమ్మవరపు దిబ్బయ్య, యడ్లపల్లి బుచ్చిబాబు, వాసిరెడ్డి రవి, మచ్చ నవీన్, మచ్చ సూరయ్య, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, తిరువాయిపాటి ఆంజనేయులు, తాళ్ళూరి సుబ్బారావు, చిమటా శ్రీనివాసరావు, వెంకి, కోట చంటి, బోడెల సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబడిపూడిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ఆప్షన్ - 3 గృహ నిర్మాణాలపై విజిలెన్స్ తనిఖీలు

సత్తెనపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి గృహ నిర్మాణశాఖ పరిధిలో ఆప్షన్- 3 కింద గండ్లూరు, ధూళిపాళ్ళ జగనన్న లే అవుట్‌లలో జరుగుతున్న నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయనే సమాచారం మేరకు బుధవారం సాయంత్రం విజయవాడ నుంచి వచ్చిన హౌసింగ్ విజిలెన్స్ డీఈ రాజు ఆధ్వర్యంలో మండలంలోని గండ్లూరు-2 లేఅవుట్‌లో ఆప్షన్- 3 కింద నిర్మితమవుతున్న గృహాలను తనిఖీ చేశారు. బెడ్ లెవల్ దాక నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ డబ్బులు తీసుకొని కొన్ని గృహాలను నిర్మించకుండా వదిలి వేయటంపై స్థానిక హౌసింగ్ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డిని ఆయన ప్రశ్నించారు. ఆప్షన్- 3 పథకంలో భాగంగా నిర్మితమవుతున్న గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల ఖాతాల్లో జమయిన డబ్బులు అధికారుల ద్వారా కాంట్రాక్ట్ ఖాతాకు మళ్ళినట్టు తెలుస్తుంది. మండలంలో ఆప్షన్- 3 కింద నిర్మాణమవుతున్న గృహాలను సంబంధిత కాంట్రాక్టర్‌తో వెంటనే పూర్తి చేయించాలని, కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని విజిలెన్స్ అధికారి స్థానిక డీఈని ఆదేశించారు. తనిఖీల నేపథ్యంలో గృహ నిర్మాణాల్లో అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

వ్యాధులపై అవగాహన ఉండాలి

● డాక్టర్ సుభాష్ చంద్రబోసు

పిడుగురాళ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా పిడుగురాళ్ల ఐఎంఏ ఆధ్వర్యంలో స్థానిక భవనాశి కల్యాణ మండపంలో డాక్టర్స్ డే అవార్డు, సన్మానసభ కార్యక్రమం జరిగింది. పిడు గురాళ్ల ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏపీ శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోటూరి సుభాష్ చంద్రబోసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో వ్యాదుల గురించి సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. అనంతరం కొన్నేళ్లుగా విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నాయుడు వసంతరావు, సీసీ సుబ్బారావు, బాదం శివారెడ్డి, కేవీ సుబ్బారావు, ఆలా సాంబశివరావులను డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్ పురస్కారాన్ని అందజేసి సన్మానించారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన డీపీవో

బెల్లంకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో బుధవారం పల్నాడు జిల్లా డీపీవో నాగేశ్వరనాయక్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వాహణ తీరును అంచనా వేసి ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు నిర్వాహణ, పారిశుధ్య సిబ్బంది పని తీరు వంటి అంశాలను పరిశీలించి కొంత సేపు సిబ్బందితో చర్చించారు. పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని, తడి, పొడి చెత్తను తీసుకెళ్లి డంపింగ్ యార్డులో వేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున పరిసరాల శుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సుపరిపాలనే కూటమి లక్ష్యం

- లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- అభివృద్ధికి విఘాతం పిన్నెల్లి నీచ రాజకీయం
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బుధవారం వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడులో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జూలకంటి ప్రారంభించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం, దోపిడి వల్ల రాష్ట్రంపై, ప్రజలపై పడిన ఆర్థిక భారాలను ప్రజలకు వివరించారు.



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సూపర్ సిక్స్ పథకాల హామీకి కట్టుబడి ఉన్నాం..

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా లక్షల కోట్లు ఖర్చు చేసి సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ప్రజలకు ఏం కావాలో వాటిని తూచ తప్పకుండా సీఎం చంద్రబాబు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.

నేరస్తులు, గంజాయి బ్యాచ్, బెట్టింగ్ రాయుళ్లే దోస్తులు..

ప్రపంచం సైతం చీదరించుకునే నీచ రాజకీయవేత్త జగన్‌రెడ్డి అని, ఆయనకు నేరస్తులు, గంజాయి బ్యాచ్, బెట్టింగ్ రాయుళ్లే దోస్తులని ఎమ్మెల్యే జూలకంటి ఎద్దేవా చేశారు. ఈవీఎంలు ధ్వంస రచనకర్త, మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి విఘాతకుడైన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని జైల్లో ములాఖత్‌తో ప్రారంభించిన జగన్ ఓదార్పుల పరాకాష్ట బెట్టింగ్ రాయుడి విగ్రహం ప్రారంభోత్సవం వరకు వచ్చిందన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఉండి సొంత బాబాయి హత్య కేసునే గాలికొదిలసిన దౌర్భాగ్యుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, అంజయ్య, కళ్లం రామాంజిరెడ్డి, కుర్రి శివారెడ్డి, ముళ్లమూరి కోటయ్య, రాజబోయిన మధు, వజ్రనాయక్, మండలపు రామకృష్ణ, పులుసు శివారెడ్డి, సామినేని సిద్ధయ్య, ముటుకూరు బ్రహ్మయ్య, యెనుముల కేశవరెడ్డి, గురవారెడ్డి, కజ్జం సైదయ్య, గుండాల శ్రీనివాసరావు, సాతులూరి కుమార్, మేకల దాసు, లింగా బ్రహ్మయ్య, కొమెర శివ, గుజ్జుల పాపిరెడ్డి, జాని, చంటి తదితరులు పాల్గొన్నారు.

విజనరీ యాక్షన్ ప్లాన్‌పై కన్నా సమావేశం

సత్తెనపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గ విజనరీ యాక్షన్ ప్లాన్‌పై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని అధికారులతో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరిశ్రమలు, వ్యవసాయం, రోడ్ల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటానికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి చూపించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాలను కూడా గుర్తించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, జరగబోయే అభివృద్ధి ఇంకా పలు కీలక అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు చక్రవర్తి, నగేష్, ఎంపీడీవో సత్యనారాయణ, సచివాలయం నుంచి వచ్చిన ఐదుగురు ఉద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు.


సుపరిపాలన గురించి ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గురించి ప్రజలందరికీ తెలియజెప్పాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే కార్యాలయంలో క్రోసూరు మండల ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ఆశలకు, ప్రభుత్వం సాధించిన విజయాలకు వారధిగా ఈ కార్యక్రమం నిలవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. నాలుగు సంవత్సరాల్లో ముఖ్యమైన హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా ప్రతి నాయకుడు భాగస్వామి కావాలన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆర్థిక పునర్నిర్మాణం జరుగుతున్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలాగా చెప్పాల్సి ఉందన్నారు. నాయకులందరూ సమర్థతతో, సమగ్రతతో సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పరిశీలకులు రాము, మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, నూర్జహాన్ బేగం, నలజాల సదాశివరావు, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో మొక్కు చెల్లించుకున్న తెలుగుమహిళలు

సత్తెనపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జగన్ అరాచక ప్రభుత్వం అంతమై టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా కన్నా లక్ష్మీనారాయణ అధిక మెజార్టీతో గెలవాలని ఎన్నికల ముందు నియోజకవర్గంలోని తెలుగుమహిళలు సాగర్ మాతకు మొక్కుకున్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని సాగర్‌మాతను దర్శించుకొని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. వీరిలో భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, తోట అంబిక, కోనంకి మారుతీ, అనురాధ, మల్లేశ్వరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



సాగర్‌లో మొక్కుబడులు చెల్లించుకున్న తెలుగు మహిళలు

80 శాతం హామీలు నెరవేర్చాం : వందనాదేవి

రాజుపాలెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 80 శాతం హామీలను నెరవేర్చామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి భీమినేని వందనాదేవి తెలిపారు. బుధవారం రాజుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వందనాదేవి మాట్లాడుతూ గతంలో ఎన్నికల్లో రూ.3వేలు ఇస్తానని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.250 చొప్పున నాలుగు సంవత్సరాలు పెంచారన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కూటమి అధికారంలోకి రాగానే పింఛన్ రూ4 వేలు చేశారని, దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తిగా మంచానికి పరిమితమైతే రూ.15వేలు ఇస్తున్నారని గుర్తు చేశారు. అదే విధంగా తల్లి వందనం పేరుతో ఒక ఇంట్లో నాలుగురు బిడ్డలు చదువుకునే వారు ఉంటే వారందరికీ రూ.15 వేలు చొప్పున ఇచ్చారన్నారు. చేసిన పనులను చెప్పుకోవటానికి నేటి నుంచి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైం దన్నారు. ఇందులో భాగంగా నియోజవర్గంలోని సత్తెనపల్లిలో 11వ వార్డులో ప్రారంభమైందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చేసిన మంచి పనులను చెప్పుకుంటూ ముందుకు సాగాలన్నారు.

ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌కు.. సిద్ధమవ్వండి

ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశం కోసం నేడో రేపో సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేయనుంది. అందువల్ల విద్యార్థిని విద్యార్థులు ముందుగానే కౌన్సెలింగ్‌కు సన్నద్ధంగా ఉండాలని ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు సూచిస్తున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్‌కు అవసరమైన సర్టిఫికెట్లను సిద్ధం చేసుకుని చివరలో జరిగే వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు (పాత చిత్రం)

గుంటూరు విద్య జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెండు ప్రభుత్వ యూనివర్సిటీలు (ఏఎన్యూ, జేఎన్టీయూకే నరసరావుపేట)36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నాయి. అదేవిధంగా దాదాపు 25పైగా ఫార్మసీ కళాశాలలు రెండు అగ్రికల్చరల్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఆయా ఇంజనీరింగ్ కళాశాలలో దాదాపు 30,250 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫార్మసీ, వ్యవసాయ కళాశాలలో 10 వేలకు పైగా సీట్లు ఉన్నాయి.ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ, ఈసీఈ మెకానికల్, సివిల్ కెమికల్, డేటా సైన్స్ ఇతర బ్రాంచీలు అందుబాటులో ఉన్నాయి. డిమాండ్ ఉన్న ప్రధాన బ్రాంచీల్లో సీట్లు రావాలంటే ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధ్యాపకులను సూచిస్తున్నారు .లేని పక్షంలో మంచి ర్యాంకు వచ్చినా మంచి కళాశాలలో మంచి బ్రాంచిలో సీట్లు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు లేదా నిర్దేశించిన హెల్ప్‌లైన్ సెంటర్స్ లేదా సొంతంగానే ఆప్షన్స్ ఇచ్చుకోవాలని సూచిస్తున్నారు.

సర్టిఫికెట్లు ముందుగానే ఉంచుకోండి

కన్సల్టెన్సీలను, మధ్యవర్తులను నమ్మితే ఇంతే సంగతులు..

కన్సల్టెన్సీలు దళారులను నమ్మితే ఇంతే సంగతులు

ఇంజనీరింగ్ ,ఫార్మసీ, అగ్రికల్చరల్ కౌన్సెలింగ్ కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ కన్సల్టెన్సీలను, దళారులను నమ్మవద్దని కళాశాల యాజమాన్యాలు సూచిస్తున్నాయి. కన్సల్టెన్సీలకు, దళారులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదా వ్యక్తిగత ఫోన్ నెంబర్లు ఇవ్వడం చేయడం తగదని విజ్ఞప్తి చేస్తున్నారు. దళారులు కన్సల్టెన్సీలు కొన్ని కళాశాలలతో కుమ్మక్కై విద్యార్థిని విద్యార్థులను మోసం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకు దగ్గర్లోని హెల్ప్ లైన్ కేంద్రానికి వెళ్లి లేదా తెలిసిన ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల సహాయం తీసుకుని ఆప్షన్స్ ఇచ్చుకోవాలని సూచిస్తున్నారు.

కౌన్సెలింగ్ అవసరమైన సర్టిఫికెట్లు ఇవే..

ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ప్రధానంగా కొన్ని సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుని ఉంచుకోవాలి. ఏపీ ఈ ఏపీ సెట్ హాల్ టికెట్, ర్యాంక్ ,కార్డు 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అయితే ఆయా సామాజిక వర్గాలకు చెందిన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి. అదేవిధంగా తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలి. ఆదాయం సంవత్సరానికి రూ 2.50 లక్షలు మించరాదు. అప్పుడే ఫీజు రీయింబర్స్మెంట్ కు అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థిని విద్యార్థులు (ఈడబ్ల్యూఎస్) ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా సర్టిఫికెట్ తీసుకోవాలి . ఏప్రిల్ తర్వాత తీసుకున్న సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఇలా సాంకేతిక విద్యాశాఖ నిర్దేశించిన సర్టిఫికెట్లు కౌన్సెలింగ్ కు ముందే విద్యార్థిని విద్యార్థులు సిద్ధం చేసుకుని ఉంచుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్లోడ్ చేయాలి. అందువల్ల స్కాన్ చేసే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ మాత్రమే స్కాన్ చేయాలి. జిరాక్స్ స్కాన్ చేయడం వల్ల అవి అప్లోడ్ కాక ఇబ్బందులు వస్తాయని అధ్యాపకులు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్ మయం

(5వ పేజీ తరువాయి)

వ్యాపారుల నిషేధాన్ని పట్టించుకోవడంలేదు. గుంటూరులో రోజుకి 400 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పన్నమైతే అందులో 150 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. తయారీ పరిశ్రమలపైనే దాడులు చేసి వాటి ఉత్పత్తినే నిలిపేస్తే వ్యవహారం ఇక్కడిదదాకా రాదనేది అందరి మాట. అయితే ఈ విషయంలో అటు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం మౌనం వహిస్తున్నాయి. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసిన పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాలపై గత జూలై నుంచి కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో ఆధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ఆరికట్టే చర్యలు ప్రస్తుతం ప్రకటనలకే పరిమితమయ్యాయి. 2021 సెప్టెంబరులో 75 మైక్రాన్లకు తక్కువ కాకుండా ఉండే ప్లాస్టిక్ వినియోగించాలని భావించారు. 2022లో 120 మైకాన్ల కంటే తక్కువ ఉండే ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించారు. అయినా రోజు సరాసరి క్వింటాళ్లలో ప్లాస్టిక్ వ్యాపారం సాగుతోంది.

అనారోగ్యం అంటున్నా ఆలకించడంలేదు

ఒకప్పుడు మార్కెట్‌కు, దుకాణాలకు వెళ్తుంటే చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరి వద్ద చేతి సంచి తప్పని సరిగా ఉండేది. హోటళ్లలో ఆహార పదార్థాలు, మాంసం తదితరాల కొనుగోలు చేసినా స్టీల్ క్యారియర్లు, బాక్సులు తీసుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా లేదు. బాక్సులు, చేతి సంచి తీసుకె ళ్లడం నామోషీగా భావిస్తున్నారు. దీనికితోడు విక్రయదారులు వస్తువు ఏదైనా కవర్లలో ఇస్తున్నారు. దీంతో ప్రజలు ప్రత్యేకంగా సంచులు, బాక్సులు లాంటివి వినియోగించడంలేదు. కొనుగోలు చేసిన కూరగాయలను వ్యాపారులు కవర్లలో ఇస్తుండగా వాటిని అలాగే తెచ్చి నిల్వ చేసుకుంటున్నారు. టీ, కాఫీ తదితర దుకాణా ల్లోనూ కప్పులను వినియోగిస్తున్నారు. పేరుకు అవి పేపరు కప్పు లంటున్నా వాటి తయారీలో వినియోగించే గమ్ము వేడి టీతో పాటు కరిగి కడుపులో చేరి ప్రాణాంతక జబ్బులు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజుకు మూడు సార్లు ఈ కప్పుల్లో టీ, కాఫీ తాగితే 75 వేల సూక్ష్మ ప్లాస్టిక్ వ్యర్థాలను కడుపులోకి పంపినట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి, చల్లటి వాతావరణాలలో ప్లాస్టిక్‌లో ఉ న్న సూక్ష్మ వ్యర్థాలు ఆహార పదార్థాల్లో మిళితమై వాటిని మనం తిన్న ప్పుడు కడుపులో చేరి అనారోగ్యం బారిన పడేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ కవర్లు.. ఇతర వస్తువులు వినియోగంపై నిషేధం విధించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో నిబంధనలు అమలు కావడంలేదు. ప్రతి మనిషి నిత్యం సగటున 25 నుంచి 50 గ్రాము ల మేర ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. ఈ లెక్కన మూడు జిల్లాల్లో ప్లాస్టిక్ వినియోగం టన్నుల్లో ఉంటుండగా అదంతా చెత్త కుప్పల్లో పోగుపడి అక్కడి నుంచి డంపింగ్ యార్డులకు చేరి చివరికి భూమిలో కరగక నీరు, వాయు, భూ కాలుష్యానికి కారణమవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవడం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది.



క్రోసూరు : రోడ్డు పక్కన పడవేసిన ప్లాస్టిక్ ఖాళీ బాటిల్స్



తెనాలి : నిషేధిత కవర్లలో ఆహారం పార్సిల్‌ను తీసుకువెళుతున్న వ్యక్తి

రాజకీయ జోక్యం..

ప్లాస్టిక్ నిషేధం అమలుపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. 2019 వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పలు మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేశారు. ఆ తర్వాత రాజకీయ జోక్యంతో నిషేధం అటకెక్కింది. ప్లాస్టిక్ విక్రయించే వ్యాపారులకు వైసీపీ నేతలు కొమ్ముకాయడంతో నిషేధం నిలిచిపోయింది. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు నిషేధాన్ని పక్కాగా అమలు చేసే క్రమంలో పలు మున్సిపాలిటీల్లో అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ పదార్థాలు ఎంత ఇస్తే అంతకు సమానంగా ఉల్లిపాయలు, ఇతర కూరగాయలు అందించి ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. ఆయా అధికారులు ఉద్యోగ విరమణ చేశాక వచ్చిన యంత్రాంగం వాటి నిషేధంపై పెద్దగా దృష్టిపెట్టకపోవడంతో యథావిధిగా జరుగుతుందన్న ఆరోపణలున్నాయి.

రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ..

భాగస్వాములు కావాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

గుంటూరు(తూర్పు), జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గుంటూరు, రైలుపేటలోని బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు నివాసానికి విచ్చేసి మాజీ ఎమ్మెల్సీ, దివగంత జూపూడి యజ్ఞనారాయణ సతీమణి జూపూడి హైమావతమ్మను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జరిగితే బీజేపీ మరింతగా బలోపేతం అవుతుందని అన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం అందజేస్తున్న సహకారం, కేంద్ర పథకాలపై రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సంస్థాగతంగా బీజేపీ బలోపేతమే నా ముందున్న లక్ష్యమని, దీనికి పార్టీ శ్రేణులును సమాయత్తం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరి వెంకట సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్, బొల్లాప్రగడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పీవీఎన్ మాధవ్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, జూపూడి హైమావతమ్మ

రెండు ప్రత్యేక రైళ్లకు..

టిక్కెట్ల బుకింగ్ ప్రారంభం

● 4వ తేదీన నాందేడ్, 6న తిరుపతి నుంచి బయలుదేరనున్న రైళ్లు

● నెమలిపురి, రొంపిచర్లలో స్టాపేజ్ లేని వైనం

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గంలో భాగంగా వినుకొండ వరకు పూర్తి అయిన రైలుమార్గంలో రెండు ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ వాటిని ఎట్టకేలకు పీఆర్ఎస్(ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్)లోకి చేర్చింది. అయితే షెడ్యూల్‌లో ప్రకటించిన నెమలిపురి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లలో మాత్రం నిలుపుదల సౌకర్యాన్ని కల్పించలేదు. పీఆర్ఎస్‌లో పిడుగురాళ్ల తర్వాత వినుకొండ మాత్రమే కనిపిస్తున్నది. దీంతో ఈ రెండు రైళ్లలో నెమలిపురి, రొంపిచర్ల పరిసరా ప్రాంతాల ప్రయాణీకులు టిక్కెట్లను బుకింగ్ చేసుకోలేని పరిస్థితి నెలకొన్నది. ఈ నెల నాల్గో తేదీన తొలి రైలు నాందేడ్ నుంచి బయలుదేరనుంది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే మరికొన్ని గంటల సమయం మాత్రమే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి అవకాశం ఉన్నది. అయినప్పటికీ రైల్వే శాఖ కమర్షియల్ సర్క్యులర్ విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. దీని వలన ప్రయాణీకుల ఆదరణ ఉండే అవకాశం లేకుండా పోయింది.

ఈ నెల 4, 11, 17, 25(శుక్రవారం) తేదీలలో నంబరు. 07189 నాందేడ్ - తిరుపతి ప్రత్యేక రైలుని పిడుగురాళ్ల నుంచి నెమలిపురి, రొంపిచర్ల మీదగా వినుకొండకు తీసుకెళ్లి అక్కడి నుంచి నంద్యాల మార్గంలో తిరుపతికి నడిపేందుకు షెడ్యూల్‌ని ఇప్పటికే ప్రకటించింది. అలానే నంబరు. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ ట్రైన్‌ని ఈ నెల 6, 13, 20, 27(శనివారం) తేదీల్లో తిరుపతి నుంచి నంద్యాల మార్గంలో వినుకొండ వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి రొంపిచర్ల - నెమలిపురి మీదగా నడికుడి మార్గంలోకి మళ్లించి నాందేడ్‌కు నడిపేందుకు సమయ పట్టికని విడుల చేసింది. దీంతో తమ ప్రాంతానికి రైలు రాబోతున్నదని నెమలిపురి, రొంపిచర్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఎంతో సంతోషానికి గురయ్యారు. ఈ రైలు వలన సులభతరంగా తిరుపతి చేరుకోవచ్చని భావించారు.

ఎంతో ఉత్సాహంతో పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్లకు వెళ్లి తిరుపతికి టిక్కెట్‌లు బుకింగ్ చే సుకొనేందుకు ప్రయత్నించగా పీఆర్ఎస్‌లో ఈ రెండు స్టేషన్లకు ఇంకా అనుమతి రాలేదని సిబ్బంది సమాధానం చెబుతుండటంతో ప్రయాణీకులు అసంతృప్తికి గురవుతున్నారు. కనీసం ఐఆర్‌సీటీసీ తదితర ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు, యాప్‌లలోనూ యాక్టివేట్ చేయలేదు. మరోవైపు రిజర్వేషన్ బుకింగ్ గడవు సమయం సమీపిస్తుండటంతో కొత్త రైలుని తాము ఎక్కలేమేమోనని ప్రయాణికులు అసంతృప్తికి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డివిజనల్ అధికారులు హెడ్‌క్వార్టర్స్‌తో మాట్లాడి కనీసం గురువారం ఉదయానికి అయినా పీఆర్ఎస్‌లో నెమలిపురి, రొంపిచర్ల స్టేషన్లు కనిపించేలా చూడాలని ప్ర యాణికులు విజ్ఞప్తి చేశారు. కనీసం జనరల్ టిక్కెట్‌లు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయిం ది. సీసీఎం నుంచి రైళ్లను ఆపరేట్ చేసేందుకు కమర్షియల్ సర్క్యులర్ విడుదలైతే రైల్వేకు సంబంధించి సాఫ్ట్‌వేర్ పర్యవేక్షించే సంస్థ నిమిషాల్లోనే యాక్టివేషన్ చేసే అవకాశం ఉన్నదని సమాచారం.

పనితీరు ఆధారంగానే బదిలీలు

● సీటీవోలు, డీసీటీవోలను గ్రేడ్‌లుగా వర్గీకరణ

● కార్యాలయాలూ విభజన

● నేటితో ఆప్షన్స్ ఎంపిక ప్రక్రియ ముగింపు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇకపై వాణిజ్యపన్నులశాఖలో అధికారులకు పనితీరు ఆధారంగానే బదిలీలు చేపట్టేలా ఆ శాఖ చీఫ్ కమిషనర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఆదేశాల మేరకు సీటీ శాఖలో ఉద్యోగుల మినహా సీటీవో, డీసీటీవోలకు గ్రేడ్‌ల వారీగా విభజించి బదిలీ ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాణిజ్యపన్నులశాఖలో ఉద్యోగులు ఒకే స్థానంలో ఐదేళ్ళ కాల పరిమితి పూర్తి చేసిన వారు బదిలీకి అర్హతతో పాటు అంతకు లోపు సర్వీసు ఉన్న వారు రిక్వెస్ట్ బదిలీ పెట్టుకునేలా ఇప్పటికే మార్గదర్శకాలు విడుదలైన విషయం తెలిసిందే. ఆ మేరకు ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే బదిలీలకు తుది గడువు ఈనెల 4వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చీఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారుల పనితీరు ఆధారంగా వారిని ఏ, బీ గ్రేడ్‌లుగా వర్గీకరించే ప్రక్రియ చేపట్టారు. అలానే రెవెన్యూ ఆధారంగా కార్యాలయాలను ఏ, బీ గ్రేడ్‌ల వారీగా విభజించారు. ఆయా గ్రేడ్‌ల వారీగా అధికారుల బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. అధికారుల పనితీరును బట్టి ఏ, బీ కేటగిరీలుగా విభజించి వారికి ఆయా కార్యాలయాలకు బదిలీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారులకు ఆప్షన్స్ ఎంపిక ప్రక్రియకు గురువారం వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. 4న పూర్తిస్థాయిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



ఈ దఫా ఉద్యోగులకూ గ్రేడ్‌ల విభజన....

ఈ దఫా ఉద్యోగుల పనతీరు ఆధారంగా గ్రేడ్‌ల వారీగా విభజించనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అధికారులను వారి పనితీరు బట్టి గ్రేడ్‌ల విభజించారని, వచ్చే దఫా బదిలీల సమయానికి కింది స్థాయిలో ఉద్యోగుల పనితీరును బట్టి వారిని కూడా ఏ, బీ కేటగిరీలుగా విభజించనున్నట్లు చెబుతున్నారు. వారి పనితీరు ఆధారంగానే బదిలీ ప్రక్రియ ఉంటుందని, అంతా ఆన్‌లైన్‌లైనే ఈ తంతు కూడా జరుగుతుందని పేర్కొన్నారు.

ఫస్టు రిజర్వేషన్ ఛార్టింగ్

సమయంలో మార్పు

● రైల్వేబోర్డు నుంచి కమర్షియల్ సర్క్యులర్ జారీ

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైళ్ల ఫస్టు రిజర్వేషన్ ఛార్టింగ్ సమయంలో రైల్వేబోర్డు కొన్ని సవరణలు చేసింది. ఇప్పటివరకు ఏ రైలు అయినా బయలుదేరడానికి నాలుగు గంటల ముందుగా తొలి ఛార్టింగ్ చేస్తుంది. అనంతరం ఖాళీలు ఏమైనా ఉంటే కరెంటు ఎవలైబులిటిలోకి తీసుకొస్తుంది. అయితే వెయిటింగ్ లిస్టులో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న ప్రయాణికులు తమ టిక్కెట్ కన్‌ఫర్మ్ అయిందో, లేదో తెలుసుకోవడానికి రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు వరకు నిరీక్షించాల్సి వస్తున్నది. కన్‌ఫర్మ్ కాకపోతే అప్పటికప్పుడే ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను వెతుక్కోవడంలో చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు కొన్ని సవరణలు చేసింది. ఇక నుంచి తదుపరి రోజు వేకువజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల మధ్యన బయలుదేరే రైళ్లకు తొలి రిజర్వేషన్ ఛార్టు ముందురోజు రాత్రి 9 గంటలకే సిద్ధమౌతుంది. దాంతో గతంలో కంటే ముందుగానే వెయిటింగ్ లిస్టు టిక్కెట్ కన్‌ఫర్మ్ అయిందో, లేదో తెలిసిపోతుంది. అలానే మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11.59 గంటల మధ్యన, అర్ధరాత్రి 12 గంటల నుంచి వేకువజామున 5 గంటల మధ్యన బయలుదేరే రైళ్లకు ఎనిమిది గంటల ముందుగా తొలి ఛార్టు సిద్ధమౌతుంది. ఇక సెకండ్ ఛార్టింగ్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. రిమోట్ లోకేషన్స్‌లో రూపొందించే ఛార్టులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నది. ఈ నిర్ణయం దృష్ట్యా గుంటూరు డివిజన్‌లో ఉదయం బయలుదేరే పల్నాడు, గోల్కొండ, సింహాద్రి, ఔరంగబాద్, కాచీగూడ, రేపల్లె - సికింద్రాబాద్, శబరి, ఫలక్‌నుమా రైళ్లకు ముందురోజు రాత్రి 9 గంటలకే తొలి ఛార్టు సిద్ధమౌతుంది. దాని వలన కరెంటు బుకింగ్‌లో టిక్కెట్‌లు ఎన్ని ఉన్నాయనేది తెలుసుకోవచ్చు.

గిజిగాడి గూడు.. ఆ అల్లిక చూడు





వర్షాకాలం వచ్చిందంటే చాలు చెరువు కట్టలపై ఉన్న చెట్ల వద్ద గిజిగాళ్ళ సందడి మొదలవుతుంది. తోడుతో జతకట్టేందుకు అందమైన గూళ్ళు కట్టి జతగాళ్లను గిజిగాళ్లు ఆకర్షిస్తాయి. ఎంతో నైపుణ్యంతో మంత్ర ముగ్ధుల్ని చేసే ఈ గూళ్ళు ఎంతో నైపుణ్యంతో కట్టిన వీటిని చూసి ఆశ్చర్యానికి గురికావాల్సిందే.

-గుంటూరు(ఆంధ్రజ్యోతి)





ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి: ఏవో శ్రీలత

నాదెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగుచేసిన పంటను ఈ క్రాపులో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీలత అన్నారు. మండలంలోని బుక్కాపురం, చందవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. 50శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీఏఏ కోటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అక్రమ మద్యం, బహిరంగ మద్యపానంపై కేసులు

● ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

ఈపూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జూన్‌లో మద్యం దుకాణాలలో మూడు అక్రమ మద్యం కేసులు, బహిరంగ మద్యపానంపై నాలుగు కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. బెల్ట్ షాపులపై 33 కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై 11 కేసులు, కల్లులో ఎటువంటి కల్తీ జరగకుండా నివారించడం కోసం కల్లు శాంపిల్‌లు తీసి రసాయనిక పరీక్షకు పంపడం జరిగిందన్నారు. కేసులులో ఉన్న 34మందిని మండల తహసీల్దార్‌కు బైండోవర్ చేశామన్నారు. నవోదయం-2లో భాగంగా నాటుసారా నిర్మూలనకు గ్రామ కమీటీలు ఏర్పాటు చేసి అగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. మద్యం దుకాణాలు టైమింగ్స్ తనిఖీ చేసేందుకు ఎక్సైజ్ ఐయాప్ ద్వారా సిబ్బందికి డ్యూటీవేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. మద్యం దుకాణాల వద్ద క్యూ ఆర్ సర్వే ఏర్పాటుచేసి మద్యం వినియోగదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఈపూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం మెయింటెన్స్ వర్క్ నిమితం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఏఈఈ ఎస్.గాంధీబాబు బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చిట్లాపురం, పొనుగోటివారిపాలెం, గోపువారిపాలెం, ఇనిమెళ్ళ, ముప్పాళ్ల గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఏపీపీగా సురేష్‌బాబు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట లీగల్, జూలై 2, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధాన సహాయ సెషన్స్ న్యాయస్థానం, అదనపు సహాయ సెషన్స్ న్యాయస్థానాల ఏపీపీగా నియమితులైన గుండాల సురేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను అదనపు జిల్లా కోర్టు ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి, ఏజీపీ కె.సీతారామాంజనేయులు, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ దాసరి ఉదయశ్రీ, పలువురు ప్రజా సంఘాల నేతలు, బీసీ, ఎస్సీ సంఘ నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

ఈపూరు ఎంపీడీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



నరసరావుపేట టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ఎంపీడీవోగా డీ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈపూరు ఎంపీడీవో ఇప్పటి వరకు పనిచేసిన కే ప్రభాకరరావు ఉద్యోగ విరమణ చేశారు. నకరికల్లులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపైవచ్చి బాధ్యతలు స్వీకరించారు.

మెప్మాలో ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు నరసరావుపేట పట్టణంలోని శ్రీశ్రీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం పల్నాడు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ అఖిల ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మెప్మా ఆన్‌లైన్ సేవలు సులభతరం చేసేందుకు ఆర్పీలకు ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసింది. కార్యక్రమంలో పట్టణ టూ టౌన్ సమైక్య సెక్రటరీ అంకమ్మ, ట్రెజరరీ మల్లేశ్వరి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఫీస్టా-2025

నరసరావుపేట టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో ఉన్న ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫీస్టా-2025 కార్యక్రమం నిర్వహించారు. మూడో సంవత్సరం బీ ఫార్మసీ విద్యార్థులు నాలుగో సంవత్సరం బీ ఫార్మసీ విద్యార్థులకు వీడ్కోలు వేడుకను నిర్వహించారు. ముఖ్యఅతిథి విజయవాడ కోనేరు లక్ష్మయ్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ ప్రొఫెసర్ కేఎస్ జగన్నాథరావు, విశిష్ట అతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్ భూషణ్‌రావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున. డిప్లమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

12 వాహనాలపై కేసులు నమోదు

చిలకలూరిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వాహనాల ప్రత్యేక తనిఖీలలో భాగంగా చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో బుధవారం మోటారు వాహనాల తనిఖీ అధికారి కె.గోపాల్ ఆధ్వర్యంలో నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేశారు. సుమారు 30 వాహనాలు తనిఖీచేసి 12వాహనాలపై కేసులు నమోదుచేశారు. అపరాధ రుసుము కింద రూ.47వేలు వసూలు చేశారు. ఇన్సూరెన్సు సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్, పన్ను చెల్లించని, యూనిఫాం ధరించని డ్రైవర్లపై, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లేని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. స్కూల్ బస్సులపై ప్రత్యేక దృష్టిపెట్టి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్ లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

సంక్షేమ పాలనతో ప్రజల్లో సంతృప్తి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కనమర్లపూడిలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

కనమర్లపూడి (శావల్యాపురం) జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి విముక్తి పొందిన ప్రజలు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనపై సంతృప్తిగా ఉన్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శావల్యాపురం మండలం కనమర్లపూడిలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావులు పాల్గొని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జీవీ, మక్కెనలకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో జీవీ, మక్కెనలు ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాదిగా కొనసాగిస్తున్న సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. డ్రైనేజీల్లో మురికినీరు నిలిచిపోయి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ కాలనీవాసులు జీవీకి విన్నవించగా డ్రైనేజీలను వెంటనే బాగు చేయించాలని పంచాయతీ కార్యదర్శిని జీవీ ఆదేశించారు. అనంతరం పల్లెపండగ కార్యక్రమంలో నిర్మించిన రెండు గోకులం షెడ్లను జీవీ, మక్కెనలు ప్రారంభించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, సీనియర్ నేతలు జి.విశ్వనాధం, జి.హనుమతరావు, జి.వీరమస్తాన్‌రావు, బి.పేరయ్య, వై.కోటేశ్వరరావు, ఒత్తుల వెంకటేశ్వర్లు, బి.శంకర్, వెంకటేశ్వర్లు, కె.వెంకటరత్నం, ఎం.నాగేశ్వరరావు, నరేంద్రకుమార్, వై.వీరయ్య పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చేస్తున్న చంద్రబాబు: జీవీ

కనమర్లపూడి (శావల్యాపురం) జూలై 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని 10.50 లక్షల కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టారని, ఉద్యోగులకు జీతాలివ్వడమే కష్టతరంగా మారిన పరిస్థితులను చక్కదిద్ది చంద్రబాబు ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపునకు దూసుకుపోయేలా తీర్చిదిద్దుతున్నారని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు బుధవారం శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి వచ్చిన జీవీ విలేకరులతో మాట్లాడుతూ సీబీఐ కేసులు మాఫీ చేయించుకొనేందుకు, వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుల్ని కాపాడుకునేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళితే చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, నిధులు తెచ్చేందుకు ఢిల్లీకి వెళ్ళారన్నారు. కేంద్రం నుంచి రూ.40వేలకోట్లు నిధులు తెచ్చి రాజధాని అమరావతి, పోలవరం అభివృద్ధి చేస్తున్నారన్నారు. అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ కాలనీలువేసి నివేశన స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అర్హులందరికీ త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. ఏడాదిలోనే 83శాతం హామీలు అమలను చేసిన ఘనత చంద్రబాబుదన్నారు.



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. చిలకలూరిపేట పట్టణంలోని 13, 14, 17వార్డులలో టీడీపీ పిలుపుమేరకు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం బుధవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో జరిగింది. పెదనందిపాడు రోడ్డులోని చార్లెస్ కాన్వెంట్‌కు సమీపంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఎరుకల కాలనీ, రహమత్ నగర్, వెంగళరెడ్డి కాలనీ, మద్దినగర్ తదితర ప్రాంతాలలో కొనసాగింది. రహమత్ నగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, క్లస్టర్ ఇన్ ఛార్జ్ ముల్లా కరిముల్లా, టీడీపీ సీనియర్ నేతలు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం: రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం వివరించారు. మండలంలోని విప్పర్ల, కర్లకుంట, గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత గ్యాస్ సిలిండర్లు, పించన్ల పెంపు, తల్లికి వందనం అమలు చేసినట్టు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను కల్పించనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. కర్లకుంట గ్రామంలో పశు వైద్యశాలను గోనుగుంట్ల పరిశీలించారు. పశు వైద్యశాల అభివృద్ధికి సహకరించిన టీడీపీ నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్‌ను అభినందించారు. ఆధార్ కార్డు లేక తల్లికి వందనం నిలిచి పోయిన వారికి ఆధార్ కార్డులు వచ్చేలా చూడాలని సచివాలయ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇళ్ళు లేనివారికి ఇళ్ళు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కొల్లి బ్రహ్మయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సురేష్, ఎస్.రామ్మూర్తి, పి.రామిరెడ్డి, మొండితోక రామారావు తదితరులు పాల్గొన్నారు.



విప్పర్లలో సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంచుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

చురుగ్గా తొలి ఏకాదశి పనులు

● కొండపై పరిశీలించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



కొండపై జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, అధికారులు

వినుకొండ, జూలై 2, (ఆంధ్రజ్యోతి) ఈ నెల 6వ తేదీన జరిగే రామలింగేశ్వరస్వామి తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటుచేసి భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. గతంలో వర్షం తాకిడికి కొట్టుకుపోయిన ఘాట్ రోడ్డు మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేసి, ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దేవదాయశాఖ, మున్సిపల్, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అఖండ జ్యోతి, భారీ అన్నదాన కార్యక్రమాలకు అవసరమైన పనులను పూర్తిచేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను ఆదేశించారు. అనంతరం ఎన్ఎస్‌పీ కాలనీలో విద్యుత్ ప్రభలకోసం గ్రౌండ్ శుభ్రపరచాలని, జరుగుతున్న పనులు ఏ మేరకు వచ్చాయని కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను అడిగి తెలుసుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా ఇప్పటికే డివైడర్‌లకు రంగులు వేయడం జరిగిందని, త్వరలో పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ డెకరేషన్ పనులు కూడా జరుగుతున్నట్లు జీవీకి వివరించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు పోలీస్‌లు పెద్ద ఎత్తున రక్షణ కల్పించి ప్రశాంతంగా సాంస్కృతిక కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, కౌన్సిలర్ షకీలాబేగం, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమాసు కోటేశ్వరరావు, దేవదాయశాఖ ఈవో సుధాకర్‌రెడ్డి, పీవీ సురేష్, పువ్వాడ కృష్ణ, ఆయూబ్‌ఖాన్, రెడ్డి వెంకటరత్నం, పల్లమీసాల దాసయ్య, గజవల్లి నాగపవన్, రెడ్డి నగేష్, పత్తి పూర్ణ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

సింగర కొండయ్య చౌదరికి ప్రత్యేక అవార్డు

చిలకలూరిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని భద్రాద్రి -కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పట్టణంలో మంగళవారం జరిగిన పౌరాణిక ఏకపాత్రాభినయ నాటక పోటీలలో చిలకలూరిపేట మండలం మద్దిరాలకు చెందిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి గోరంట్ల సింగర కొండయ్య చౌదరి ప్రత్యేక అవార్డు పొందారు. అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు జె ఆదినారాయణ, రామ్‌దాస్‌నాయక్‌లు అవార్డును ఆయనకు అందచేసి సత్కరించారు.

నేడు సుపరిపాలనకు తొలి అడుగు

నూజెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో సుపరిపాలన జరుగుతుందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ బచ్చు అంజిరెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మరిడి సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మిగులు భూముల సమాచారమివ్వండి

నూజెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ అసైన్డ్ భూముల వివరాలు అందజేయాలని జనసేన నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్ జీ రమేష్ కుమార్‌కు దీనిపై దరఖాస్తు చేశారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

నూజెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో పీ ఉమాదేవి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఎన్ఎస్‌పీ కాలనీలో పారిశుధ్య చర్యలు



కాలనీ ఆవరణలో చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వినుకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పటణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో ఇటీవల మున్సిపల్ సిబ్బంది చెత్తను తరలించి ఆప్రాంతాన్ని డపింగ్ యార్డును తలపించేలా తయారుచేయడంపై ఆంధ్రజ్యోతిలో కథనంపై ప్రచురితమైంది. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు సూచనమేరకు, మున్సిపల్ చైర్మన్ ఆదేశాల మేరకు, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ బుధవారం ఎక్స్‌కవేటర్ల సాయంతో పిచ్చి చెట్లను తొలగించి, భూమిని చదును చేయడంతో ఆప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సమీపంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల వద్దకు రావాలంటే ఆకతాయిల తాకిడికి ఉపాధ్యాయులు నిత్యం బయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడితే తల్లిదండ్రులు పిల్లల వద్దకు రావాలన్నా రాలేని పరిస్థితి నెలకొని ఉంది. గ్రౌండ్ శుభ్రం చేయడంపై పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలు

శావల్యాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ శాఖల ద్వారా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలను గురువారం ప్రారంభించనున్నట్లు ఎస్సార్పీ ఒత్తుల ఆవులయ్య బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతేడాది మొత్తం 467 అభివృద్ధి పనులకుగాను రూ.7.90కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, వాటిలో రూ.5.90కోట్లు ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించగా రూ.2కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీలలో ఒక ఎస్సార్పీ, 15మంది డీఆర్పీలు పాల్గొంటారన్నారు. వీటికి సంబంధించిన రికార్డులు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి సేకరించామన్నారు. గురువారం సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఏపీవో రామారావు, డీఆర్పీలు పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించాలి: రసూల్

వినుకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బ్రాహ్మణపల్లి, జాలపాలెంలో ఉద్యానశాఖ అధికారి రసూల్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఆరీఫ్, రైతు సేవా కేంద్ర సిబ్బంది సాయిరామ్‌సింగ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం

బొల్లాపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా ఐదు సంవత్సరాలు పాటు అపర్ణ ఎంతో విలువైన సేవలు అందించారని పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రాజు అన్నారు. పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ పై వెళ్ళిన హెచ్ఎం అపర్ణ, ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ అపర్ణ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, దీనిని కొనసాగించటానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ మన్ననలు పొందాలన్నారు. సన్మానంపొందిన వారిలో అపర్ణతో పాటు ఉపాధ్యాయులు విజయకుమారి, ఉమా కుమారి, శ్రీలక్ష్మి, కౌశల్య శ్రీనివాసరావు, తిరుపతిరావు, మన్నెయ్య, కోటేశ్వరరావులు ఉన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

శావల్యాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులు, ఓపీలు, గర్భవతులు, బాలింతల రికార్డులు, అభా, పీఎంజేవై, వయోవందనం కార్డులు, ల్యాబ్ పరీక్షలు, రికార్డులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల పనితీరును ఆరా తీశారు. అనంతరం పొట్లూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి ఆరోగ్య సేవలను తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాలలోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి ఉన్నతమైన సేవలందించాలని, పీహెచ్‌సీలో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, ఏఎన్ఎంలు నాగలక్ష్మి, విజయలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీగా రాఘవయ్య



నాదెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీగా రాఘవయ్య నియమితులయ్యారు. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న నిర్మల లక్ష్మీకుమారి గడిచిన 30వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో సాతులూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాఘవయ్యను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

అత్తింటి ఎదుట కోడలి మౌన పోరాటం



అత్తింటి ఎదుట నిరసన తెలుపుతున్న స్వప్న

పెదకాకాని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం అత్తవారింటి ఎదుట కోడలు మౌన పోరాటానికి దిగిన సంఘటన పెదకాకాని మండలం ఉప్పలపాడులో బుధవారం జరిగింది. ఉప్పలపాడు చెందిన పెద్ది ప్రసాదరావు, సులోచన దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు పెద్ది రాజేష్ కుమార్‌కు 15సంవత్సరాల క్రితం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం అవిశాయపాలెం గ్రామానికి చెందిన స్వప్నతో వివాహం జరిగింది. అయితే రాజేష్ కుమార్ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వివాహ సమయంలో రాజేష్ కుమార్ పేరిట ఉప్పలపాడులో రెండు ఇళ్లు, రెండు ఎకరాల భూమి ఉన్నట్లు చెప్పారని. వాటిపై వచ్చే ఆదాయాన్ని తన పోషణ నిమిత్తం ఇవ్వాలని పెద్ది స్వప్న మౌన పోరాటానికి దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఉప్పలపాడు చేరుకొని బాధితురాలిని పెదకాకాని పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని తెలిపారు. దీంతో బాధితురాలు పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి: తహసీల్దార్ సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్

వినుకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సురేష్ నాయక్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసరాలను త్వరితగతిన పంపిణీ చేయాలని, కొత్త రైస్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని, సీసీఆర్‌సీ కార్డు నమోదు వేగవంతం చేయాలని, నీటి తీరువా వసూలు, అన్నిరకాల సేవలను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్ఐ శ్రీహరి, వీఆర్‌వోలు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

డెంగీ జ్వరంపై అవగాహన ర్యాలీ

నాదెండ్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని సాతులూరులో విద్యార్థులతో కలసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. వర్షాకాలం వస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నీటి తొట్టెలు, కొబ్బరి బోండాలు, టైర్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఏడుకొండలు, నాగరాధిక, మల్లేశ్వరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు యడ్లపాడు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు

యడ్లపాడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా టీడీపీ ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గురువారం సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా కోరారు.